క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు తిలకిస్తుండగా వేదమంత్రోచ్చరణ కల్యాణోత్సవం పండితులు జరిపించారు.

ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భద్రాచలంటౌన్: కేన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన జి.అనూషకు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యఖర్చుల నిమిత్తం శనివారం రూ.10 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు, సభ్యులు పీవీ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా అరుణభారతి



అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్‌గా డాక్టర్ టీ.అరుణభారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. పశు సంవర్థకశాఖలో పనిచేస్తున్న ఆమెను ఇక్కడి స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. గతంలో స్పెషల్ ఆఫీసర్‌గా పనిచేసిన అనసూర్య కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

రేపు 'సంఘం శరణం గచ్ఛామి' ప్రదర్శన

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సోమవారం సంఘం శరణం గచ్ఛామి కళారూపాన్ని ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో కళాకారులతో బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆశయాలు, లక్ష్యాల అంశాలపై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి హైదరాబాద్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పట్టణ ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నేడు వైద్యశిబిరం

అశ్వాపురం: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోటరీక్లబ్ భద్రాచలం వారి సౌజన్యంతో మండల పరిధిలోని మనుబోతులగూడెం గ్రామ పంచాయతీలోని వేములూరు గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సీఐ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొంటారని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

గుండాల: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్రగాయాలైన ఘటన ఆళ్లపల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మర్కోడు గ్రామానికి చెందిన కొమరం కాంతారావు కర్నిగూడెం గ్రామానికి కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

డ్రైవర్లు, క్లీనర్లకు ప్రోత్సాహకం చెల్లించాలి

మణుగూరు టౌన్/ మణుగూరురూరల్: ఏరియాలోని ఓసీ–4 – కొండాపురం సీఎస్‌పీ కోల్ ట్రాన్స్‌పోర్ట్ టిప్పర్ల డ్రైవర్లకు, క్లీనర్లకు రూ.5 వేల ప్రత్యేక ప్రోత్సాహకం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో శనివారం ఎస్‌ఓటూ జీఎం శ్యామ్ సుందర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ... నిత్యం బొగ్గు రవాణా చేస్తున్న టిప్పర్ల డ్రైవర్లు, క్లీనర్లకు ఇటీవల సింగరేణి యాజమాన్యం వార్షిక లాభాల్లో చెల్లించిన వాటాను రెండు నెలలు గడుస్తున్నా బ్యాంకు ఖాతాల్లో కాంట్రాక్టర్ జమ చేయలేదన్నారు. కాంట్రాక్టర్‌కి యాజమాన్యం రెండు నెలల క్రితమే చెల్లించినట్లుగా మెసెజ్‌లు వచ్చాయని ఇప్పటి వరకు కాంట్రాక్టర్ డ్రైవర్ల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో నల్లారమేశ్, శివరామకృష్ణ, తోలెం దుర్గారావు, వాడ సీతారాములు, కర్ని వేణు, రాచకొండ ప్రవీణ్, ఇష్తికర్ తదితరులు ఉన్నారు.

మన్యంపై చలి పంజా..

రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- పొగమంచుతో వాహన రాకపోకలకు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, వృద్ధులు
- ఉద్యోగులకు తప్పని తిప్పలు



పొగమంచులో వాహనాల రాకపోకలు..

భద్రాచలంటౌన్: భద్రాద్రి మన్యం చలి పంజా విసురుతోంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే వచ్చే మూడు నెలలు చలి తీవ్రత ఎలా ఉంటుందని ఏజెన్సీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి నుంచి మొదలైన పొగమంచు ఉదయం పది గంటల వరకు తగ్గడంలేదు. దీంతో వాహన రాకపోకలను తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ఏజెన్సీలో మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈశాన్యం నుంచి వీస్తున్న చల్లని గాలుల కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. చలి తీవ్రతతో పట్టణంతో పాటు ఏజెన్సీలోని గ్రామాలలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటల వరకు చలి ప్రభావం తగ్గడంలేదు. సాయంత్రం 5 దాటితే ఈదురు గాలులతోపాటు వాతావరణం పూర్తిగా చల్లబడిపోతుంది. ఆ సమయాల్లో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావడంలేదు. ఉదయం పూట ఏజెన్సీ గ్రామాల్లో చలికి తట్టుకోలేక చలి మంటలు వేసుకుంటున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు సైతం కనిష్ట స్థాయిలో నమోదు అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తప్పని తిప్పలు..

చలితీవ్రత పెరగడంతో ఉద్యోగులతో పాటు పట్టణంలో ఉదయం పూట చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. భద్రాచలం కేంద్రంగా నివసిస్తూ ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేసే వారు చలికి తట్టుకోలేకపోతున్నారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐటీసీ కార్మికులు విధులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, రాత్రి షిప్టులకు వెళ్లే కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది.



మంచులోనే వాకింగ్ చేస్తున్న పట్టణ వాసులు

వృద్ధులు, పిల్లలపై ప్రభావం

చలితీవ్రత పెరగడంతో వృద్ధులు, పిల్లలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పాఠశాలలకు వెళ్లే పిల్లలు ఉదయం ఏడు గంటలలోపే బయల్దేరాల్సి రావడంతో చలితో ఇబ్బంది తప్పడం లేదు. పాఠశాలలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో వాతావరణం చల్లబడుతుండటంతో గజగజవణికిపోతున్నారు. వృద్ధులు, యువకులు చలి నుంచి తట్టుకోలేక స్వెట్టర్లు, మఫ్లర్లు వదలడంలేదు. చలి మంటలు కాగుతూ రక్షణ చర్యలు పాటిస్తున్నారు. ఉబ్బసం, ఆయాసం ఉన్న వారి బాధలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఉన్ని దుస్తువులు అమ్మే దుకాణాలు ప్రజలతో రద్దీగా కనిపిస్తున్నాయి.

జాగ్రత్తలు పాటించాలి



చలి కాలం వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరింత అప్రమత్తంగా వుండాలి. చలికాలంలో పిల్లల విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. చిన్నపిల్లలను ఉదయం పూట ఎండకు ఉంచడం మంచిది. పిల్లలను బయటకు తీసుకెళ్లే సమయంలో వెచ్చని దుస్తులు ధరింపజేయాలి.

– డాక్టర్ వై.రాజశేఖరరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు

సమయపాలన తప్పక పాటించాలి

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



ములకలపల్లి: విద్యా ప్రమాణాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

ములకలపల్లి: ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి, కొద్దిసేపు పాఠాలు బోధించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలకు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ... మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లత, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

ఇళ్లు కేటాయించాలని వినతి..

దమ్మపేట: పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని వినాయకపురం శివారు ఎర్రగుంటపల్లిలో గుడిసెలు నిర్మించుకుని నివాసముంటున్న వారిపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేసి, వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని, వారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను తిరిగి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు కెచ్చల రంగారెడ్డి, గోకినపల్లి ప్రభాకర్, అమర్లపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సిరిగుండంలో సర్వే



గ్రామస్తులతో సర్వే అధికారులు

దుమ్ముగూడెం: మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామపంచాయతీ పరిధిలో గల వలస ఆదివాసీ గ్రామమైన సిరిగుండం గ్రామంలో ఎట్టకేలకు సర్వే అధికారులు కుటుంబ సమగ్ర సర్వే శనివారం చేపట్టారు. సిరిగుండం ఛాయాచిత్రం ఆధారంగా తెలంగాణలో లేదని సర్వే అధికారులు కుటుంబ సమగ్ర సర్వే చేయడానికి నిరాకరించారు. దీంతో ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయగా విషయం తెలుసుకున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి 30 ఏళ్ల నుంచి ఉంటున్నట్టు ప్రజల నుండి ఆధారాలను సేకరించి సరియం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేశారు. ఆధారాలను పరిశీలించిన అధికారులు గ్రామాన్ని కూడా సమగ్ర సర్వే జరపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఆ గ్రామంలో సందర్శించి కుటుంబాల వివరాలు సేకరించి సర్వే నిర్వహించారు. ఈ మేరకు గ్రామ ప్రజలకు అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. మడకం నందా, పుల్లయ్య, మడకం రమేష్, రవ్వ బీమయ్య, రాజు, తాటి జోగయ్య పాల్గొన్నారు.

అమలు కాని హామీలిచ్చిన కాంగ్రెస్



దుమ్ముగూడెం: మాట్లాడుతున్న సుదర్శన్



మణుగూరు రూరల్: ర్యాలీలో నాయకులు

దుమ్ముగూడెం: కేసీఆర్ దుర్మార్గపు పాలనతోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఆయన అడుగు జాడల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని, అమలుకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. శనివారం పార్టీ మండల మహాసభ సీతారాం ఏచూరినగర్‌లోని సవలం వీరస్వామి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు కార్మికులు, కర్షకులు, రైతు కూలీల హక్కుల కోసమే నిరంతరం పోరాటాలు నిర్వహిస్తారన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం లగచర్ల ప్రాంతంలో పేదల భూములను గుంజుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. అనంతరం పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు పార్టీ మండల కార్యదర్శిగా కారం పుల్లయ్యను మళ్లీ ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, కొర్స చిలకమ్మ, మచ్చ వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవి కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మాచారి, రేపాక శ్రీనివాస్, భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, మాజీ ఎంపీటీసీ మచ్చా కృష్ణకుమారి, నాయకులు మర్మం చంద్రయ్య, యలమంచి శ్రీనుబాబు, కొడాలి లోకేష్ బాబు, వాగే ఖాదర్ బాబు, బొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మణుగూరు రూరల్: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని పార్టీ నాయకులు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శనివారం పార్టీ మండల మహాసభలను దొడ్డి నెహ్రూ ఇంటి వద్ద నిర్వహించారు. తొలుత నాయకులు గడ్డం ముత్తయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం పట్టణంలో పార్టీ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మాయమాటలతో మోసం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె. రమేష్, నాయకులు నిమ్మల వెంకన్న, గద్దల శ్రీనివాసరావు, నెల్లూరి నాగేశ్వరరావు, రాములు, నరసింహారావు, నందం ఈశ్వరరావు, సత్రపల్లి సాంబశివరావు, సుధాకర్, టీవీఎంవీ ప్రసాద్, కొండ్రు గౌరి, దొడ్డి నిర్మల, నరసయ్య పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు



పొంగులేటికి జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: మండలంలో రెడ్డి సంఘం భవణ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి స్థలాన్ని కేటాయించాలని మణుగూరు రెడ్డి సమాఖ్య అధ్యక్షుడు నాసిరెడ్డి విజయ్‌భాస్కర్ రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో మంత్రిని కలిసిన నాయకులు జ్ఞాపికను అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉడుముల తిరుపతి రెడ్డి, సీరపు గణేశ్‌రెడ్డి, మైత్రి గ్రూప్స్ అధినేత సానికొమ్ము వెంకటరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, గాయం అవినాష్ రెడ్డి, బంకు శ్రీనివాసరెడ్డి, జయపాల్‌రెడ్డి ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థిని



ద్వితీయ స్థానంలో నిలిచిన రిత్విక

చర్ల: మండల కేంద్రంలోని రాహూల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థిని రిత్విక పాల్వంచలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ 300 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటింది. ఈ మేరకు రిత్వికను విద్యాలయం వ్యవస్థాపకులు డాక్టర్ డీఎస్ కుమార్, డాక్టర్ ప్రతిభ, డైరెక్టర్ టీవీపీపీ శాస్త్రి, ప్రిన్సిపాల్ జీ.వర్మరాజు, పీడీ ఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

'సింహగర్జన'ను జయప్రదం చేయండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చంద్రుగొండ: వచ్చే నెల హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన మహాసభను జయప్రదం చేయాల్సిందిగా సంఘం మండల అధ్యక్షుడు బడుగు శంకర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో శనివారం పోస్టర్లలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి రామారావు, తలారి నాగరాజు, మంగయ్య, బడుగు చిన్న ఎల్లయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

భద్రాచలం–కొవ్వూరు రైల్వేలైన్‌పై దృష్టి పెట్టాలి



పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న శంకరరావు

అశ్వారావుపేటరూరల్: భద్రాచలం–కొవ్వూరు రైల్వే లైన్ ఏర్పాటుపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు దృష్టి పెట్టాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకరరావు కోరారు. శనివారం అశ్వారావుపేటలో ఆ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన హాజరై, ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైల్వేలైను భూ సేకరణ ప్రక్రియను పట్టించుకోవాలన్నారు. ఈ లైను ఏర్పాటైతే రెండు తెలుగు రాష్ట్రాలకు, ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి పేరుతో అరాచకం చేశారని, నాటి సీఎం రాష్ట్రాన్ని అప్పులపాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెలుగు జాకబ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జయంతి వేడుకలు



దమ్మపేట: అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు



అశ్వారావుపేటరూరల్: పూజలు చేస్తున్న భక్తులు

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేటలో శనివారం శ్రీ సత్య సాయిబాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అశ్వారావుపేటరూరల్: శ్రీ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో ఉదయం సంకీర్తన నిర్వహించి, మందిరంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా నిలుస్తాం

మణుగూరు రూరల్ : పేద ప్రజలకు కమ్యూనిస్ట్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో పేదరికం ఉన్నంత కాలం ఎర్ర జెండా వారి హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. పినపాక నియోజకవర్గంలో మండలాల, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సీపీఐ కీలకపాత్ర పోషించిందన్నారు. అనంతరం 11మంది సభ్యులతో నూతన గ్రామశాఖ కమిటిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి సుధాకర్, మండల కార్యవర్గ సభ్యులు కణితి సత్యనారాయణ, మాటూరి వరలక్ష్మి, నరసింహ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రాముడు

దుమ్ముగూడెం: ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు ప్రజలను చైతన్యం చేసి బీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఎదుగుదల కోసం దిశానిర్దేశం చేసేందుకు డిసెంబర్ 5న జరగనున్న మండల జనరల్ బాడీ సమావేశంకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల కో కన్వీనర్ జానీ పాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మీ, సొసైటీ డైరెక్టర్‌లు బొల్లి వెంకట్రావు, కాలువ పూర్ణయ్య, నాయకులు తునికి కామేష్, కొత్తూరి సీతారామారావు, వాగె వేంకటేశ్వరరావు, దామెర్ల శ్రీనివాసరావు, కొత్త మల్లేశ్వరరావు, కణితి లక్ష్మణుడు, రావులపల్లి పృథ్వీ, నోముల రామిరెడ్డి, కోర్స నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి

దుమ్ముగూడెం: విద్యార్థులను ఫోన్లకు దూరంగా ఉంచుతూ, ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటూ పబ్లిక్ పరీక్షలకు వారిని తల్లిదండ్రులు సన్నద్ధం చేయాలని దుమ్ముగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణవేణి అన్నారు. ఈ మేరకు శనివారం కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేశారు. ప్రతీరోజు విద్యార్థులను కళాశాలకు వచ్చేలా బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో ప్రతిభ



మణుగూరు రూరల్: విద్యార్థులతో చైర్మన్ షరీఫ్

మణుగూరు రూరల్: మండల కేంద్రంలోని జెడ్పి కో ఎడ్యుకేషన్ పాఠశాలలో 21న నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఎక్సలెంట్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులను చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఎండి ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్ అభినందించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మణుగూరు రూరల్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో జరిగిన గ్రామశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, కో కన్వీనర్ నూకారపు రమేష్, నాయకులు గువ్వా రాంబాబు, ముద్దంగుల కృష్ణ, రామకోటి, అక్కి నర్సింహరావు, పప్పుల ప్రసాద్, దామల్ల దయాకర్, వరదయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీని అరికట్టాలి

మణుగూరు రూరల్: ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసి ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీవైఎల్ నాయకులు ఎం.లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రులను బలోపేతం చేయాలని పీవైఎల్–పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ముద్రించిన రాష్ట్రవ్యాప్త ఉద్యమం గోడపత్రికలను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో సరైన వసతులు, వైద్య పరికరాలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడాల్సిన వస్తోందన్నారు. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, మెరుగైన ల్యాబ్స్ ఏర్పాటు చేసి టెక్నిషియన్లను నియమించాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవేందర్, పి.దేవా, కన్నయ్య, అర్జున్, రాజు, గంగరాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీ సమీపంలో ఉన్న ఓ పామాయిల్ తోటలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్రవాహనాలతోపాటు రూ.1,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా గౌడ వనసమారాధన



మెచ్చా నాగేశ్వరరావుతో సంఘం నాయకులు

దమ్మపేట: గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని నాగుపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో గౌడ వనసమారాధన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. పిల్లలు, పెద్దలు అందరూ కలసి ఆట పాటలతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందిమళ్ల లక్ష్మినారాయణ, అంగోతు భాస్కరరావు, కందిమళ్ల సర్వేశ్వరరావు ఉన్నారు.